# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని గ్రామ పంచాయతీల్లో కాలానుగుణ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్**

2. **తెలంగాణ ఉద్యోగులకు 1 కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి**

3. **మాదకద్రవ్యాల రవాణా నియంత్రణలో పోలీసు శాఖ, ఈగల్ బృందాలు సమర్ధవంతంగా పనిచేస్తున్నాయని పేరొన్న ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వి. అనిత**

4. **ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఈరోజు నుంచి ప్రారంభం కానున్న రొట్టెల పండుగ**

==========================

వర్షాకాలం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లోని అన్ని గ్రామ పంచాయతీలో కాలానుగుణంగా వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధుల నివారణ, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఉపముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం “ఫ్రైడే--డ్రైడే” కార్యక్రమాన్ని అమలు చేసి, నీటి నిల్వలను గుర్తించి తొలగించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే సరిచేయాలని, నీటి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.

--------------------------

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఒప్పంద పొరుగు సేవలు సిబ్బందికి 1 కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పించే అవగాహనా ఒప్పందం- ఎంవోయూ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యమని తెలుపుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు నూతనంగా ఎన్నికైన నలుగురు సభ్యులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, సానా సతీశ్, లింగమనేని రమేశ్‌లను కేంద్ర మంత్రి తన నివాసానికి ఆహ్వానించి నిన్న సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయాన్ని రాష్ట్ర అభివృద్ధికి మరింత సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై పెద్దల సభలో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని, ప్రజా సమస్యలని రాజ్య సభలో ప్రస్తావించాలని కోరారు.

---------------------------

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని ఈరోజు పాటిస్తున్నారు. ప్రతిఏటా జూన్ 26 వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేకదినం పాటించాలని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధిసభ ఇచ్చిన పిలుపుమేరకు 1987 డిసెంబర్ 7వ తేదీన ఒక తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి ఆమోదించింది. అప్పటి నుంచి ప్రతి యేటా జూన్ 26న ఈ కార్యక్రమం జరుగుతోంది. మాదకద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు ప్రత్యేకించి యువతకు తెలియజేయడమే ఈకార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తుకు, దేశ అభివృద్ధికి ముప్పుగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి సమీపంలోని ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో ఈగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె నిన్న పాల్గొన్నారు. అక్రమ గంజాయి సాగు, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణలో పోలీసు శాఖ, ఈగల్ బృందాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఈసందర్భంగా మంత్రి తెలియజేస్తూ... వాయిస్ 22 సెకన్లు

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ సూచించారు. విజయవాడలోని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ -- దిశా సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు అందించి పనిదినాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

వాయిస్ 23 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఈరోజు నుంచి ప్రారంభం కానుంది.

రోజుల పాటు జరిగే ఈ పండుగలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొననున్నారు. కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ, నెరవేరిన వారు కృతజ్ఞతగా రొట్టెలను మార్చుకునే వేడుక కోసం నెల్లూరు స్వర్ణాల చెరువు ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. , కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

---------------------------

పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలకంగా నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసం సెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహించిన కార్యక్రమంలో 32 లక్షల 20 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి –సీఎంఆర్ఎఫ్ చెక్కులను 45 మంది లబ్ధిదారులకు మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చేయూత అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, ప్రధాన పట్టణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ – క్యూర్ పరిధిలోనే పది అంతస్తుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో దాదాపు 20 ప్రాంతాల్లో ఇప్పటికే స్థలాలను గుర్తించామని, తొలి విడతలో ప్రయోగాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో 500 చొప్పున ఇళ్లను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి–శిక్షణ శాఖలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్, యానంలోని దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

అలాగే తెలంగాణ లోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================